www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 6 అక్టోబర్ 2024

5

తూర్పుగోదావరి



టెట్‌కు 581 మంది హాజరు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

శనివారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 581 మంది హాజరయ్యారని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. రెండవ రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆయన తెలిపారు. పేపర్ మిల్ వద్ద గల రాజీవ్ గాంధీ విద్యా సంస్థలో గల ఇయాన్ డిజిటల్ జోన్‌లో శనివారం ఉదయం సెషన్ -1లో పేపర్ 2ఎ ఇంగ్లీష్ లాంగ్వేజ్ పరీక్ష జరిగిందని తెలిపారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి ఎఎంఎంలకు పలు సూచనలు ఇచ్చారు. రెండో రోజు 642 మందికి 581 మంది హాజరుకాగా 61 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు కె.సత్యనారాయణ, గణపతి వ్యవహరిస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

- దయనీయంగా పెట్రోలు బంకుల నిర్వహణ
- హెచ్చు బంకుల్లో కానరాని వసతులు
- వ్యాపారమే పరమావధిగా యాజమాన్యాల తీరు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పెట్రోల్ బంకుల యాజమాన్యాలు నిబంధనలకు నీళ్లొదులుతున్నాయి. అత్యధిక బంకుల్లో కనీస వసతులు కూడా ఉండట్లేదు. టైర్లకు గాలి పెట్టుకునే అవకాశం ఉండదు. దాహం వేస్తే తాగునీరు దొరకదు.. మరుగుదొడ్ల సంగతి సరేసరి. కొన్ని చోట్ల మరుగుదొడ్లను ఏర్పాటు చేసినా నిర్వహన అధ్వాన్నంగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోలు నాణ్యతా ప్రమాణాలు పరీక్షించడానికి ఫిల్టర్ పేపర్లు వినియోగదారులకు ఇవ్వాల్సి ఉన్నా ఎక్కడా ఈ దాఖలాలు లేవు. ప్రజల ప్రయాణ అవసరాల రీత్యా జిల్లాలో వాహనాల సంఖ్య ప్రతి సంవత్సరమూ గణనీయంగా పెరుగుతోంది. ద్విచక్ర వాహనాలతో పాటు, కార్లు, లారీలు, బస్సులు ఇతర వాహనాల సంఖ్య కూడా అధికంగా వినియోగం పెరిగింది. దీంతో జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లు సుమారు 100కు పైగా ఏర్పాటయ్యాయి. పెట్రోలు, డీజిల్ సరఫరా చేసే కంపెనీలు సైతం డీలర్లకు ఆకర్షణీయమైన కమీషన్ ఇస్తూ బంకుల సంఖ్యను పెంచుతూ వస్తున్నాయి. అయితే నాణ్యత, సౌకర్యాలు తనిఖీ చేయాల్సిన సంబంధిత అధికారులు మాత్రం వీటివైపు కన్నెత్తి చూడట్లేదనే విమర్శలు ఉన్నాయి. ఫలింగా బంకుల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి.



పెట్రోల్ బంకుల్లో మోసాలు ఇలా...

మైక్రోచిప్ మాయాజాలంతో పెట్రోల్ బంకుల్లో మోసాలు జరుగుతున్నాయి. ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు, సిబ్బంది అక్రమాలకు తెరతీస్తున్నారు. పెట్రోల్ వేసేందుకు పైపు నాజిల్ తీసి బైక్ ట్యాంక్‌లో పెట్టగానే.. కొన్నిచోట్ల తొలుత సున్నాతో ప్రారంభమవుతోంది. ఆ తర్వాత క్షణాల వ్యవధిలోనే రూ.వందల విలువగల ఆయిల్ వెళ్లినట్లు రీడింగ్ చూపిస్తోంది. మరికొన్నిచోట్ల మీటర్ రీడింగ్ 10 లేదా 20 పాయింట్ల వద్ద ప్రారంభమవుతోంది. అత్యధిక బంకులో రూ 100 కి గాను రూ. 90 మాత్రమే పట్టే పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితులు అన్నిటికీ ముందుగానే మదర్ బోర్డు ల లో రీడింగ్ తప్పుగా మైక్రోచిప్ లో తప్పుడు సంకేతాలు ఇచ్చేలా రూపొందించడం కారణమని తెలుస్తోంది. అదేవిధంగా డిజిటల్ కాటా లోపలి భాగంలో ఇంటిగ్రేటెడ్ చిప్‌అమర్చి రిమోట్ కంట్రోల్ ద్వారా రీడింగ్ ఎక్కువగా చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా కొలతల తేడా చూపించే అవకాశాలు ఉన్నాయి. ఈ విధమైన పద్ధతి పట్టణాలతోపాటు జాతీయ రహదారిపై ఉన్న అనేక బంకుల వద్ద కనిపిస్తుంది.

అనుసరించాల్సిన నిబంధనలు

పెట్రోలు బంకుల్లో 10 వేల లీటర్ల ఇంధనం విక్రయిస్తే వచ్చిన ఆదాయంలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.600 వెచ్చించాలి. నెలకు రూ.18 వేలు మరుగుదొడ్లకు, మంచినీరు, ఇతర సౌకర్యాల కల్పనకు ఖర్చు చేయాలి. వినియోగదారుల టైర్లలో గాలి తగ్గి బంకు వద్దకు వస్తే గాలి నింపే యంత్రాలు పనిచేయడం లేదని అక్కడి సిబ్బంది నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారు. నిబంధనల ప్రకారం తప్పనిసరిగా వాహనాలకు గాలి నింపే యంత్రాలు ఏర్పాటు చేయాలి. నిత్యం పనిచేయాలి.దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహన చోదకులు కాలకత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు ఉండాలి. ఎక్కడా ఏర్పాటు చేయడం లేదు. ఒకవేళ ఉన్నా తాళాలు వేసి కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల అవి తెరచి ఉన్నా అపరిశుభ్రంగా ఉంటున్నాయి.ప్రతి బంకులో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్ ఉండాలి. వాహనదారులు అందులో నమోదు చేసుకునే అవకాశం కల్పించాలి.ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి. తాగేందుకు నీరు అందించాలి. పెట్రోలు నాణ్యతాప్రమాణాలు పరీక్షించడానికి ఫిల్టర్ పేపర్లు వినియోగదారులకు ఇవ్వాలి.. ప్రతి బంకులో సంస్థ వివరాలతో పాటు యాజమాని పేరు అందరికీ కన్పించేలా ప్రదర్శన బోర్డు ఏర్పాటు చేసి మొబైల్ నెంబర్లు బోర్డుపై రాయాలి.అత్యధిక బంకులలో పై నిబంధనలు కన్పించిన దాఖలు లేవంటే అతిశయోక్త కాదు. అయితే కొనుగోలు దారులు బంకుల్లో సౌకర్యాలు లేకపోతే సెంట్రలైజ్డు గ్రీవెన్స్ అండ్ మోనటరింగ్ సిస్టమ్ పోర్టల్ అయిన పీజీపోర్టల్.జీఓవి.ఇన్‌కు లేదా జిల్లా పౌరసరఫరా అధికారి,తూనికలు, కొలతల శాఖాధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

ఇసుక బుకింగ్‌లో పారదర్శకత

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



ఇసుక బుకింగ్ విధానంతో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం కలెక్టరు క్యాంపు కార్యాలయం నుంచి ఇసుక సరఫరా, తదితర అంశాలపై ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని రీచ్‌ల్లో ఇసుక అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆ మేరకు టెక్నికల్ టీమ్స్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు ఇసుక డేటా వివరాలు నమోదు చేయాలన్నారు. అప్‌లోడ్ చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో, యాప్‌లో కనిపించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. బల్క్ బుకింగ్ విధానంలో జాయింట్ కలెక్టర్ వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టాలన్నారు. బల్క్ బుకింగ్ కేటాయింపులు సరఫరా తదితర అంశాలను స్వయంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిరు. బుకింగ్ అయిన వాటిని తిరస్కరించకుండా ఇసుకను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డిఒలు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఇసుక తవ్వకాల విషయంలో ముందుకు రాని బోట్స్ మ్యాన్ సొసైటీ సభ్యుల స్థానంలో వేరే బోట్స్ మ్యాన్ సొసైటీకి కేటాయించాలన్నారు. ఇసుక తవ్వకంలో ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రెవెన్యూ సంబంధ అంశాలపై, 22ఎ, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల స్థలాలు కేటాయింపు తదితర అంశాలపై డివిజన్ మండల స్థాయి అధికారులకు సూచనలు చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, సమన్వయ శాఖల అధికారులు, ఇతర మండల స్థాయి అధికారులు, ర్యాంపుల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి అకాడమీల నిర్మాణాలు

ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - రాజానగరం



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న మధుసూదన్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రభుత్వాల సహకారంతో అనువైన ప్రదేశాల్లో ఎన్‌సిసి అకాడమీ భవన నిర్మాణాలకు ప్రణాళిక రూపొందిస్తామని ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ వి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. రాజానగరం సమీపంలో గ్లోబల్ గోదావరి విశ్వవిద్యాలయం, గైట్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న ఎన్‌సిసి శిబిరాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఎన్‌సిసి కేడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. 29 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న దేశంలోని 17 ఎన్‌సిసి శిబిరాల్లో 300 మంది సీనియర్ కేడెట్లు ఈ కార్యక్రమాలకు హాజరయ్యారన్నారు. 12 రోజుల ఈ శిబిరం జరుగుతుదన్నారు. జాతీయ సమైక్యత, కమ్యూనిటీ లివింగ్, దేశ నిర్మాణంలో ఏకత్వ భావన దిశగా స్ఫూర్తి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. వెలగపూడి సచివాలయానికి సమీపంలోని గుంటూరులో ఆంధ్రప్రదేశ్ కోసం ప్రత్యేక ఎన్‌సిసి డైరెక్టరేట్ కోసం ప్రణాళిక రూపొందించామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు. ఆయన వెంట కో-ఆర్డినేటర్ దిలీప్‌కుమార్ ఉన్నారు.

కోరుకొండ తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీలు

సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - గోకవరం

కోరుకొండ తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఆకస్మింగా తనిఖీలు చేపట్టారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు, హాజరు పట్టిక ప్రకారం హాజరైన సిబ్బంది వివరాలను విధుల్లో ఉన్న డిప్యూటీ తహశీల్దార్ ఎ.రజనీని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉండాల్సిన సిబ్బంది ఎందుకు కార్యాలయంలో లేరనే వివరాలు తెలుసుకున్నారు. హాజరు పట్టీని తన వెంట తీసుకుని వెళ్లారు. సంబంధిత సిబ్బంది కలెక్టరేట్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. తహశీల్దార్ క్షేత్ర స్థాయిలో విచారణ కోసం వెళ్లారన్నారు. ఈ సమయంలో విధుల్లో ఉండాల్సిన సిబ్బంది బాధ్యత రాహిత్యంతో వ్యవహరించిన తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో సమయ పాలన పాటించడం, సిబ్బంది కదలికలను సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. తదుపరి మాత్రమే విధులకు హాజరు కావాలని తెలిపారు. విధి నిర్వహణలో నిలక్ష్యంగా వ్యవహరించిన సిబ్బంది నుంచి తగిన వివరణ తీసుకొని నివేదిక అందించాలని తహశీల్దార్‌ను ఫోన్‌లో ఆదేశించారు. ఎటువంటి అనుమతులు లేకుండా గైర్హాజరైన సిబ్బంది వివరాలను హాజరుపట్టీలో కలెక్టర నమోదు చేశారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్, జువాలజీ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి ఉన్నారు.



డిప్యూటీ తహశీల్దార్‌ను ఆరా తీస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఘాట్ల పరిశీలన

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఘాట్లను తహశీల్దార్ డి.అచ్యుతకుమారి శనివారం పరిశీలించారు. మల్లేశ్వరం గ్రామం గోదావరి తీరంలో ఉన్న మల్లేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. దేవస్థానాన్ని ఆనుకుని ఉన్న పుష్కర ఘాట్‌ను పరిశీలించారు. ఆమె వెంట సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, ఎంపిటిసి సభ్యులు దేవికారాణి, మాజీ ఎంపిపి మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, దేవస్థానం మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మల్లేశ్వరం ఉప సర్పంచ్ బొలిశెట్టి పట్టాభి రామారావు, జనసేన నాయకులు ఎం.శివ ఉన్నారు.

ఎస్ఎంపి మోటార్స్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - గోకవరం

కృష్ణునిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎంపి మోటార్స్ షోరూమ్‌ను శనివారం రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. షోరూమ్ ప్రొప్రైటర్ సిద్ధ కాశి వ్యాపార అభివృద్ధికి తనవంతు సాయాన్ని అందిస్తానన్నారు. నిజాయితీగా కష్టపడే వారికి తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. ప్రొప్రైటర్ సిద్ధ కాశి మాట్లాడుతూ తమ నూతన వ్యాపారాన్ని కంబాల శ్రీనివాసరావు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తమ షోరూమ్‌లో చేతక్ స్కూటీలను మంచి ఆఫర్లలో అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావు శర్మ, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో శాఖల వారీగా పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కార పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అర్జీల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాల వారీగా సమీక్ష చేస్తున్నారన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల పరంగా అత్యధికంగా ప్రతి సోమవారం అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. అదే స్థాయిలో వాటిని పరిష్కారం చేసే దిశగా మండల స్థాయి అధికారులు వ్యక్తిగత పర్యవేక్షణ అవసరం అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల కార్యాలయాలు నుంచి, కలెక్టరేట్ నుంచి వచ్చే అర్జీల పరిష్కారం విషయంలో మరింత సమర్థవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిధిలో వచ్చిన అర్జీలు ఎందుకు పెండింగ్‌లో ఉంటున్నాయనే దానిపై తహశీల్దార్‌లను ఆరా తీశారు. అర్జీలు పరిష్కార స్థాయి 90 శాతంపైగా ఉన్నా, నూటికి నూరు శాతం పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. జిల్లాలో 763 అర్జీలు పెండింగులో ఉన్నాయని, వాటిలో 72 గంటల్లోగా పరిష్కారం చేయాల్సిన 21, నాలుగు రోజుల నుంచి తొమ్మిది రోజుల్లోగా పరిష్కారం చేయాల్సినవి 78, పది రోజుల్లోగా పరిష్కారం చేయాల్సినవి 650 ఉన్నాయని తెలిపారు. అర్జీల పరిష్కారం కోసం గరిష్టంగా 10 రోజులు పరిష్కారం చేయవలసి ఉంటుందన్నారు. వీటిలో పరిష్కారం పరిమితుల దాటినవి 3 ఉన్నాయనీ తెలిపారు. పరిష్కారం కాని అర్జీల కోసం అధికారులకు లేఖలు రాశామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.నరసింహులు, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీల పెండింగ్‌కు కారణాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

బడికి పంపేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

బడిఈడు పిల్లలందర్నీ బడికి పంపేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా న్యాయస్థానం ఆవరణలో బాలల హక్కుల పరిరక్షణ, మిస్సింగ్ బాలల కోసం వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పిల్లలు విద్యాభ్యాసానికి దూరం కాకూడదని, వివిధ కారణాల వల్ల విద్యకు దూరమవుతున్న పిల్లలను గుర్తించి వారిని బడికి పంపించే దిశగా చర్యలను ముమ్మరం చేయాలన్నారు. ఈ మేరకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ శాఖల సమన్వయ కృషితో పిల్లలను కాపాడి వారికి అవసరమైన సహాయం అందించాలన్నారు. పిల్లల హక్కులకు భంగం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై ఎప్పటికప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు నివేదిక అందించాలన్నారు. ఈ సమావేశంలో తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ కె.విజయకుమారి, ప్యానల్ లాయర్లు, ట్రైన్డ్ మీడియేటర్ పి.శ్రీనివాసరావు, జిఎస్‌కెఎం న్యాయ కళాశాల ప్రిన్సిపల్ మధుసూదనరావు, ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గహం సూపరింటెండెంట్ భాస్కర్, జువైనల్ జస్టిస్ బోర్డు అధికార్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ సూర్య ప్రభావతి, పోలీసు అధికార్లు, రెవెన్యూ అధికార్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 'రోడ్డు ప్రమాదాల నివారణ', 'హెల్మెట్ ఆవశ్యకత'పై ప్లీడర్ గుమస్తాలు సునీత అవగాహన కల్పించారు. హెల్మెట్లు పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలని ఇపిఎఫ్ఎస్-95 పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. సెంట్రల్, స్టేట్ కమిటీల పిలుపు మేరకు ఈ నెల 7న దేశ వ్యాప్తంగా అన్ని ప్రావిడెంటు ఫండ్ ప్రాంతీయ కార్యాలయాల వద్ద ఆందోళనకు పిలుపునిచ్చామని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సోమేశ్వరరావు, సిహెచ్.మోహనరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హయర్ పెన్షన్ అమలు చేయాలని, రైల్వేలో రాయితీలు పునరుద్ధరించాలని, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇందులో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం ప్రావిడెంటు ఫండ్ కార్యాలయం వద్ద ఉదయం 9గంటల నుంచి 1 గంట వరకూ నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు, అమలాపురం, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పెన్షనర్ల అందరూ పాల్గొనాలని కోరు.

బేవరేజెస్ కార్పొరేషన్ ఎడిఎంగా రామకృష్ణదాసు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చాగల్లులో ఆంధ్రప్రదేశ్ బేవరీస్ కార్పొరేషన్ ఎడిఎంగా రామకృష్ణదాసు శనివారం విధులను చేపట్టారు. ఆయన గతంలో శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో పనిచేశారు. అలాగే ఎక్సైజ్ సిఐగా విఎన్‌వి.లక్ష్మి శనివారం విధుల్లో చేశారు. ఆమె గొడవర్తి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసి సిహెచ్.తరంగిణి వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం విధులను సక్రమంగా నిర్వహిస్తానన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎంఎల్ఎ నెహ్రూ

ప్రజాశక్తి- గోకవరం

అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతుందని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం తిరుమలాయపాలెంలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. సర్పంచ్ పురంశెట్టి శివాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.40 లక్షలతో వీటిని నిర్మించనున్నారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో రూ.3.85 లక్షలతో నిర్మించిన ఆర్ఒ ప్లాంట్‌ను ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో ఆర్థిక పరిస్థితులు గాడి తప్పినప్పటికీ కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. అనంతరం తిరుమలాయపాలెంలో శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు అడపా భరత్‌బాబు, జగ్గంపేట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, టిడిపి నాయకులు ఉంగరాలు గణేష్, సాలపు నలమహారాజు, గునిపే భరత్, ఉండమట్ల దొరబాబు, గళ్ల రాంబాబు, ఎస్.చక్రరావు, ఎ.శ్రీనివాసరావు, జయరాజు, శ్రీను పాల్గొన్నారు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


ప్రజాశక్తి - చాగల్లు

కాంట్రాక్టర్లకు బిల్లులు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మేడ వెంకటకృష్ణవరప్రసాద్ కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బిల్లులు రాకపోవడంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుపోయామన్నారు. నాలుగేళ్లుగా చేసిన పనులకు నేటికీ బిల్లులను చెల్లించలేదన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా బిల్లులు చేతికి అందలేదన్నారు. అప్పులు చేసి పనులు పూర్తిచేశామని తెలిపారు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి ఆర్థికంగా నష్టపోయామన్నారు. కాంట్రాక్టర్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కడియం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియం గిరిజాల కళ్యాణ మండపంలోని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దీనికి ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. గర్భిణులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవన నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, తెలుగు రైతు రాష్ట్ర నాయకులు అన్నందేవుల చంటి, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఐసిడిఎస్ పీడీ విజయకుమారి, ఎంపిడిఒ కె.రత్నకుమారి, వైస్ ఎంపిపి పంతం గణపతి, చెల్లిబోయిన శ్రీనివాస్, ప్రత్తిపాటి రామారావు చౌదరి, ముద్రగడ జెమ్మి, సిడిపిఒలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సత్యసాయి కార్మికులకు ఎంఎల్ఎ బత్తుల హామీ

ప్రజాశక్తి - సీతానగరం



సత్యసాయి పథకం కార్మికులతో ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ

సమ్మెలో ఉన్న సత్యసాయి కార్మికులతో ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మూడు రోజులుగా శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ సప్లయీస్, మెయింటినెన్స్ వర్కర్స్ సమ్మె చేస్తున్నారు. 16 నెలలగా వేతనాలు అందని కారణంగా రాజమహేంద్రవరం రూరల్ వాటర్ సప్లయ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. శనివారం రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ సమ్మె శిబిరాన్ని సందర్శించారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 20 రోజుల క్రితం రెండు రోజులు ధర్నా నిర్వహించగా ఎటువంటి స్పందన లేకపోవడంతో సమ్మె బాట పట్టాల్సి వచ్చిందన్నారు. సమ్మె కారణంగా ఐదు మండలాల్లో 80 గ్రామాలకు తాగునీరు సరఫరా నిలిచిపోయింది. రెండేళ్లుగా ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించట్లేదన్నారు. ఈ సమస్యలను నెలరోజుల్లోగా పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో వారు సమ్మెను విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పూర్ణిమరాజు, యూనియన్ నాయకులు ఐ.శ్రీనివాసులు, కె.మల్లేశ్వరరావు, పి.శ్రీనివాస్, జె.సురేష్, కె.రామకృష్ణ, సత్య సాయి సిబ్బంది పాల్గొన్నారు.

ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని 14 గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఈనెల 7వ తేదీ నుంచి 8వ తేదీ వరకు గోకవరం ఐకెపి మీటింగు భవనంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిపాలనా విధానం, ఎపిపిఆర్-1994 చట్టం, నిబంధలనపై రెండు రోజుల పాటు శిక్షణ తరగతలు నిర్వహిస్తామన్నారు.

ఆర్‌టిసి చైర్మన్‌కు మార్గాని సోదరుల అభినందన

కడియం : ఎపిఎస్ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణకు ఆయన వియ్యంకులైన తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, వీరబాబు సోదరులు మొక్కను బహుకరించి పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కొనకళ్ల గతంలో రెండుసార్లు మచిలీపట్నం ఎంపీగా పనిచేశారు. అధిష్టానం ఆయనను తాజాగా ఆర్‌టిసి చైర్మన్‌గా నియమించింది.

నేడు ఉచిత నేత్రవైద్య శిబిరం

నల్లజర్ల : లయన్స్ క్లబ్ దూబచర్ల, పార్ట్ ఇండియ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో దూబచర్లలో ఆదివారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు క్యాంప్ ఆర్గనైజర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. వేమగిరి పరమహంస యోగా నంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీ సంఘమిత్ర విద్యాలయంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తామనానరు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నేరాలు ఘోరాలు

నిల్వ చేసిన ఇసుక, ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

మండలంలో గాడిమొగ పంచాయతీ పెదవలసల చెక్కల వంతెన ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను నిల్వ చేశారు. ఆ ఇసుకను తరలించేందుకు వెళ్లిన ట్రాక్టర్‌తోపాటు, నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ మందాసిద్ధుపై కేసు నమోదు చేసి, ఇసుకను, ట్రాక్టర్‌ను తహశీల్దార్‌కు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరు మహిళలకు గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురి మహిళలు గాయాలపాలయ్యారు. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి నుంచి జగ్గంపేట వస్తుండగా బైక్ ఎదురు రావడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలకి గాయాలయ్యాయి. వారిని జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం



ఆనంద్ మృతదేహం

కె.గంగవరం మండలంలోని కోటిపల్లి యానాం రోడ్డులో కోట గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మరణించాడు. కొప్పుగుంట కొట్టిపేట వీధికి చెందిన కొజు ఆనంద్ స్నేహితునితో కలిసి యానాం నుండి కోటిపల్లి వైపు వస్తుండగా కోట సరిహద్దులోని రాజవైరి వంతెన వద్ద రోడ్డు సరిగా కనిపించక ప్రమాదవశాత్తు బైకు అదుపుతప్పి పడిపోయారు. తీవ్ర గాయాలైన ఆనంద్ (20) అక్కడికక్కడే మరణించాడు. కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యానాం వార్తలు



లెఫ్టినెంట్ గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఎల్ఎ అశోక్

లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - యానాం రూరల్

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాదన్‌ను శనివారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను గవర్నర్‌కు వివరించినట్లు ఎంఎల్ఎ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని, ప్రతి ఏట వరదలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, అందుకు రక్షణ గోడను నిర్మించాలని కోరారు. యానాంలో గంజాయి, బైక్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసులు వారిని ఛేదించినప్పటికీ నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కనకాల పేట ఏటికొట్టు మార్గంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని కోరారు.

ఘనంగా ఎంపీ వైధిలింగం పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం రూరల్

పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యులు, పుదుచ్చేరి పిసిసి అధ్యక్షులు వి.వైధిలింగం 75వ పుట్టినరోజు వేడుకలను యానాం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మల్లాడి సత్తిబాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులో గల మల్లాడి సత్తిబాబు కార్యాలయం వద్ద అభిమానులు సమక్షంలో భారీ కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాడి వీరాస్వామి, దున్నా చక్రవర్తి, లంకె నాగూర్, లంకె అంజయ్య, లంకె శ్రీను, వేపాటి వెంకటేశ్వర్లు, లంకె జాన్, పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా జాన్ మోజెస్ పుట్టిన రోజు

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఉబా జాన్ మోజెస్ పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు దవులూరి సుబ్బారావుల సమక్షంలో ఈ వేడుకలు జరిగాయి.

ఆశ.. నిరాశ..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అధికార పార్టీలో నామినేటెడ్ పోస్టులు ఆశించిన అత్యధిక మంది ఆశావహుల ఆశలు ఆవిరయ్యాయి. ఉమ్మడి గోదావరి జిల్లా నుంచి 7 కార్పొరేషన్‌లలో 14 మందికి మాత్రమే చోటు లభించింది. రాజకీయ, సామాజిక తూకంతో ఎంపిక ప్రక్రియ జరిగిందంటూ మూడు పార్టీల పెద్దలు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరస్థితి భిన్నంగా ఉంది. జిల్లా స్థాయిలో సీనియర్‌లు, కీలక నేతలకు సైతం స్థానం లభించకపోవటతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ అసంతృప్తివాదులను ఆయా పార్టీల ముఖ్యనేతలు ఏ విధంగా బుజ్జగిస్తారో వేచిచూడాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్‌ల పదవులు అలంకార ప్రాయంగా మిగిలిన విషయం విధితమే. నిధులు కేటాయింపులు లేకపోవటతో కనీసం కార్యాలయాలు సైతం ఏర్పాటు చేయని దుస్థితి నెలకొంది. నూతన ప్రభుత్వమైనా ఆయా కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించి క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించేలా ఉండాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

పులి సంచారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలను భయాందోళనకు గురి చేస్తుంది. అభయారణ్యం వదిలి గత కొన్ని రోజులుగా నివాస ప్రాంతాలకు సమీపంలో సంచరించటమే ఈ పరిస్థితి కారణం. తొలుత రాజమహేంద్రవరంలోని హౌసింగ్ బోర్డు సమీపంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు ధృవీకరించారు. తాజాగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పాదముద్రలు కన్పించడం ఆయా ప్రాంతాల ప్రజలను మరింత ఆందోళనకు గురి చేస్తుంది. గత కొన్ని రోజులుగా అటవీ శాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు విఫలం అయ్యాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం లేదని తెలుస్తోంది. మరికొద్ది రోజుల్లో వరి కోతల పనులు ప్రారంభం కానున్నాయి. మరోవైపు కడియం మండలంలో నర్సరీ వ్యాపారాలపైనా పులిసంచారం ప్రభావం తీవ్రంగా కన్పిస్తోంది. పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు కొనుగోలుదారులు సైతం వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. మరో వైపు పులి సంచారంపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారం ఆందోళనకు గురి చేస్తుంది. అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట వేయటంతో పాటు ప్రజలకు భరోసా కల్పించేందుకు ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాలన పట్టాలెక్కేనా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నతాధికారుల బదిలీలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా నుంచి పలువు అధికారులు ఇతర జిల్లాలకు బదిలీ కాగా మరి కొందరు ఉమ్మడి జిల్లాలోనే పోస్టింగులు సంపాదించారు. ఈ స్థానచలనాల వెనుక రాజకీయ పెద్దలు ఉన్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అయితే గత కొన్నేళ్లుగా ఒకే పోస్టులో కొనసాగుతున్న వారికి సైతం తాజా బదిలీలు నిరాశను పరిచాయి. జిల్లాలోనే పోస్టింగ్‌లు పొందేందుకు తెర వెనుక పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. నూతనంగా ఏర్పడిన తాజా ప్రభుత్వంపై ప్రజల ఆకాంక్షలు తగ్గట్లుగా పరిపాలన అందించాల్సి ఉంది. తమ దైన ముద్ర వేసేందుకు ఏ మేరకు ప్రయత్నిస్తారో వేచి చూడాలి.

మద్యం పాలసీపై గుబులు

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పాత విధానాన్నే అమల్లోకి తెస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. గత ప్రభుత్వం నేరుగా దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం విక్రయించి అబాసుపాలైంది. తొలుత దశలవారీ మద్య నిషేదం అని ప్రకటించి మడమ తిప్పింది. నూతన ప్రభుత్వం నాణ్యమైన మద్యం, ధరలు తగ్గిస్తామంటూ ప్రకటించడం సర్వత్రా ఆందోళన కల్గిస్తుంది. మద్యం మత్తుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వాలు పూర్తి భిన్నంగా వ్యవహరించడం పట్ల మహిళా, ప్రజాసంఘాలు కన్నెర్ర చేస్తున్నాయి.



తెగుళ్ల నివారణతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పెద్దాపురం

సార్వా వరిలో పంట చివరి దశలో దోమ, ఎండాకు తెగులు ఉధృతిని నివారించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎం.రామభద్రరాజు అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయాధికారులతో నిర్వహించిన శిక్షణ - సందర్శన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా స్థిరమైన దిగుబడులు సాధించవచ్చునని అన్నారు. గ్రాముల్లో బ్యాక్టీరియా, ఎండాకు తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు నీటి యాజమాన్యం, నత్రజని ఎరువులు ఆపివేసి మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 20 కిలోలు చల్లాలన్నారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు మాట్లాడారు. వ్యవసాయ అధికారులు బికె.మల్లికార్జునరావు, కాకాడ బాబురావు, వై.జ్యోతిర్మయి, ఉద్యాన పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ సునీత జిల్లాలోని పంటల స్థితిగతులపై వివరించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి - తాళ్ళరేవు రూరల్

ప్లాస్టిక్ వస్తువులు అతిగా ఉపయోగిస్తే క్యాన్సర్‌కు కారకం అవుతాయని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.మహేష్ తెలిపారు. శనివారం చొల్లంగి వివేకానంద పాఠశాలలో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు విషయాలపై ఫారెస్ట్ అధికారులు అవగాహన కల్పించారు. మైక్రో ప్లాస్టిక్ కలిగిన టీ గ్లాసులు, మైక్రో కవర్లలో వేడి పదార్థాలు ఆహారంగా తీసుకోవడం ద్వారా మైక్రో ప్లాస్టిక్ ఆహారంలో కలిసిపోయి పెద్ద పేగుల్లో పేరుకు పోతుందన్నారు. కిడ్నీ సైతం ఈ మైక్రో ప్లాస్టిక్‌ను ఫిల్టర్ చేయలేదని తెలిపారు. అప్పుడు అది క్యాన్సర్ కంతులుగా మారి మనిషి ప్రాణాల్ని హరిస్తాయన్నారు. గ్రీన్ క్లైమేట్ ఫండ్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీహర్ష మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం అడవులను సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు ఎస్. వీరభద్రరావు, జి.గోపినాగేంద్ర, సిహెచ్.ధనలక్ష్మి, ఎస్‌కె.సుభాని, విశ్రాంత ఫారెస్ట్ ఉద్యోగి టి.సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపల్ మొండి భీమశంకర్, ఉంగరాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఏలేశ్వరం: మహిళల రక్షణ కోసం రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలపై మహిళలు అవగాహనను పెంపొందించుకోవాలని ప్రతిపాడు న్యాయమూర్తి బుల్లెమ్మ పిలుపునిచ్చారు. శనివారం లింగంపర్తి గ్రామంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బుగతా శివ పాల్గొన్నారు.

కిక్కిరిసిన వెంకన్న ఆలయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం యాత్రికులతో కిక్కిరిసింది. వేకువ జామునే స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిసి నల్ల చక్రధర్ రావు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు. కాలినడకన వచ్చే యాత్రికులతో ఆలయ ప్రాంగణం అంతా శుక్రవారం సాయంత్రానికి కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుండి కాలినడకన వచ్చే యాత్రికులకు విశ్రాంతి తీసుకునేందుకు సౌకర్యాలు కల్పించడంతోపాటు వారికి అల్పాహారం భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం రాత్రి 9 గంటల వరకు యాత్రికుల రద్దీ కొనసాగింది. సుమారు 80 వేల పైబడి యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు.



అక్రమంగా నిర్మిస్తున్న డ్రెయిన్

డ్రెయినేజీ నిర్మాణ పనుల అడ్డగింత

ప్రజాశక్తి -మామిడికుదురు

తాటిపాక నుంచి అక్రమంగా మొగలికుదురులోకి నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను మొగలికుదురు పాలకవర్గం శనివారం అడ్డుకుంది. దీనికి ఏ విధమైన అనుమతి లేదని సర్పంచ్ కడి అరుణకుమారి పాలకవర్గ సభ్యులు స్థానికులు పేర్కొన్నారు. తాటిపాక పంచాయతీకి చెందిన మురుగునీటిని మొగలికుదురు లోకి మళ్ళిస్తుండటంతో ఇప్పటికే ఎన్నో సమస్యలు ఎదుర్కొంటుండగా మళ్లీ శ్మశాన వాటిక సమీపంలో డ్రెయిన్ నిర్మించడం వల్ల సమస్యలు ఇంకా జటిలమవుతాయని పాలకవర్గం ఆందోళన వ్యక్తం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రెయిన్ నిర్మించేందుకు వీలు లేదని వారు స్పష్టం చేశారు

వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

రోగులకు మెరుగైన వైద్యం అందించడం ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిఎం అండ్ హెచ్ఒ ఎం.దుర్గారావుదొర అన్నారు. శనివారం మండలంలోని అంగర పిహెచ్‌సిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులు, వార్డులను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ రత్నకుమారి డాక్టర్ ప్రియాంక, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు పాల్గొన్నారు.



శిక్షణ తరగతిలో ప్రసంగిస్తున్న ఎడిఎ

డ్రోన్ పిచికారీతో ఎక్కువ ఫలితం

ప్రజాశక్తి -మామిడికుదురు

వరి పంటలో ఎండు తెగులు నివారణకు రైతులు డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకుంటే ఎక్కువ ఫలితం ఉంటుందని ఎస్‌జెవి.రామ్మోహనరావు అన్నారు. నగరం కొత్త రోడ్డులో కడలి రాజు ఇటుకల బట్టీ వద్ద మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోశనివారం వరి యజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఎవిసి రాజశేఖర్, వ్యవసాయాధికారి బి.మృదుల మాట్లాడారు. ప్రస్తుతం బ్యాక్టీరియా ఎండు తెగులు అధికంగా ఉన్నందున నత్రజని ఎరువు తగ్గించి పొటాష్ ఎరువులు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, జాలెం సుబ్బారావు, వ్యవసాయ సహాయకులు ఎన్.లలిత, బి.కావ్య పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం



అధ్యాపకులను సత్కరిస్తున్న విద్యార్థులు

సమాజ ఉన్నతికి విశేష కృషి చేసే ఉపాధ్యాయుడు ధన్యుడని అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న వక్తలు అన్నారు. అంగర శ్రీసిద్ధార్థ కళాశాలలో శనివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జూనియర్ కళాశాల విద్యార్థులు అధ్యాపకులను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పోటీల్లోని విద్యార్థులకు కళాశాల డైరక్టర్ వాకా పరమేశ్వర, ఛైర్మన్ డాక్టర్ వి.దివ్యశేఖర్, కరస్పాండెంట్ వి.రాజా బహుమతులను అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులు ఉన్నతంగా రాణించే అవకాశాలు పెరిగాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో చదివిన విద్యార్థులెంతో మంది ప్రపంచ నలుమూలలా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చుతున్నారన్నారు. అధ్యాపకులు మాట్లాడుతూ ఆధునిక పరిస్థితులను విద్యార్థులు శాస్త్రీయంగా అర్థం చేసుకుని మెలగాలన్నారు. పోటీ ప్రపంచంలో మంచితో పాటు చెడు సైతం ప్రచారంలో ఉంటుందన్న విషయాన్ని గమనించాలన్నారు. తర్క భావంతో మంచి చెడులను బేరీజు వేసుకుని జీవితంలో నెట్టుకొచ్చే నేర్పును కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సామాజిక అంశాలపై కళాప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.రమణ, సీనియర్ అధ్యాపకుడు రామ్‌గోపాల్, ఎస్ఎస్‌వి.శ్రీనివాస్, కె.పరదేశి, బి.ధనప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలతో ఆటలు : కురసాల

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కురసాల

రాజకీయాల కోసం కోట్లాది భక్తుల మనోభావాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుకుంటుందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటేశ్వర స్వామిని కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసి భక్తులు మనోభావాలతో ఆటలాడుతుందన్నారు. టిడిపి ఆఖరికి దేవుడిని కూడా వదలడంలేదన్నారు. లడ్డూల వ్యవహారం సంఘటన ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగితే అది గత ప్రభుత్వానికి ఆపాదించడం సమంజసం కాదని అన్నారు. వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వారిని ఏమాత్రం పట్టించుకోలేదని, ఉచిత ఇసుక అంటూ ప్రభుత్వం గొప్పలకు పోతున్నా రాష్ట్రంలో ఎక్కడా ఇసుక లభించడం లేదన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేసేందుకు ఒకపక్క ప్రయత్నాలు జరుగుతుంటే కూటమి నాయకులు ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీశారు. మహిళలు స్వేచ్ఛగా రోడ్ పై తిరిగే పరిస్థితి లేదన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని పాలకులే తమకు తాము బాజా కొట్టుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు పుల్ల చందు, మోకా కృష్ణంరాజు, ఎలిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

కార్యకర్తల సమష్టి కృషితోనే భారీ మెజారిటీ

ప్రజాశక్తి-రావులపాలెం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యానందరావు

కార్యకర్తల సమష్టి కృషి ఫలితంగానే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రావులపాలెం మండలంలో తెలుగుదేశం పార్టీ గత ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించిందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని వెదిరేశ్వరం రోడ్డులో ఉన్న కాపు కళ్యాణ మండపంలో శనివారం టిడిపి మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ సత్యానందరావు మాట్లాడారు. దీనికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కెవి.సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి, కాసా విజయసాగర్, మేడపాటి కాసురెడ్డి, మాసాబత్తుల ఆనందరావు, కేతా శ్రీను, మైగాపుల తేజ, సిద్దిరెడ్డి శ్రీను, గంటా సుబ్బారావు, సవరపు శ్రీను, కోనాల అంబేద్కర్, నూకపెయ్యి రమేష్, దునేపూడి దుర్గ, కోట వెంకటేశ్వరరావు, వెలగల శ్రీనివాసరెడ్డి, కొప్పిశెట్టి ప్రసాద్, పడాల బులి కొండారెడ్డి, నందం సత్యనారాయణ, రెహ్మతుల్లా పాల్గొన్నారు.



పకీర్ల సమ్మేళనంలో గంధం ఊరేగింపు

కొమరాడలో ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి- మామిడికుదురు

కొమరాడలో శనిఆవరం హజరత్ మహబూబ్ సభహానీ, కరీముల్లాషా ఖాదర్‌ల ఉరుసు ఉత్సవం నిర్వహించారు. షేక్ గౌస్ స్వగృహం నుంచి పకీర్ల సమ్మేళనంతో కొమరాడ డామ్ సెంటర్ వరకు గంధం ఊరేగించారు. ప్రార్థనా స్థలం ట్రస్టీ ఎండివై.షరీఫ్ ఆధ్వర్యంలో నమాజ్ అనంతరం శాంతి సౌభాతత్వం కోరుతూ ప్రార్థనలు చేశారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

90 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని యనమదల గ్రామంలో రామచంద్రపురం నేత్ర ప్రాథమిక కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో పది మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. ఇతర కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు సిహెచ్.కుమార్, పి.సాయిలక్ష్మి, వైద్య సేవలు అందించారు.

బాధితునికి హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

ప్రజాశక్తి-అమలాపురం సిటీ



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

అల్లవరం మండలం బోడసకుర్రుపాలెంకు చెందిన కడలి శ్యామ్ అనారోగ్యానికి గురై అమలాపురం కిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నాడు. శెట్టిబలిజ హెల్పింగ్ హాండ్స్ సేకరించిన రూ.40,000 నగదును హైదరాబాద్ గుత్తుల మీరా కుమార్ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.10,000 నగదును మొత్తం రూ.50,000 శనివారం సంఘం ప్రతినిధులు శ్యామ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి వెంకటేశ్వర (బాబు), పిల్లి గంగాధర్, గొవ్వాల రాజేష్, శేఖర్, వనచర్ల రాజేష్, విత్తనాల శేఖర్, చెల్లుబోయిన నాని, కముజు రమణ, దొంగ చిన్న, కాంద్రేగుల శ్రీను, వనచర్ల రాజేష్, ఇళ్ల కిషోర్, కట్టా బుజ్జి, కేతా భాను తేజ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం



న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

స్థానిక ఐకెపి కార్యాలయంలో శనివారం మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో అడ్వకేట్లు బూసి విద్య, ప్రసన్న మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు గృహ హింస నిరోధక చట్టం, నిర్భయ చట్టం, వరకట్న నిషేధ చట్టం, పురుషులతో సమాన వేతనం, బాల్య వివాహాల నిరోధక చట్టం వంటి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళా భారత రాజ్యాంగం కల్పించిన చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. సాటి మహిళలపై ఎక్కడైనా అఘాయిత్యం జరుగుతుంటే ప్రతి ఒక్కరూ స్పందించి పోలీస్ కంప్లెయింట్ ఇవ్వాలని సూచించారు. మన ఇంట్లో పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలన్నారు. స్మార్ట్ ఫోన్ల వల్ల యువత పక్క దారి పడుతున్నారని తెలిపారు. ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో ఐకెపి ఎపిఎం ఎం.దుర్గా ప్రసాద్, ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎజలు పాల్గొన్నారు.